క్లుప్తంగా

గుంతలు పూడ్చండి మహాప్రభో..

మంత్రి సుభాష్‌కు జనసేన ఎంపీటీసీ వినతి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం వెల్ల గ్రామాన్ని కలుపుతూ వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలు పూడ్పించండి మహాప్రభో అంటూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వెల్ల–2 జనసేన ఎంపీటీసీ సభ్యురాలు మంచెం దేవి ఆదివారం బహిరంగ లేఖ రాసి పత్రికలకు విడుదల చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం పెద్ద కాలువ వంతెన నుంచి రామారావుపేట, ఏరుపల్లి, వెల్ల, కందులపాలెం, కాపవరం గ్రామాలను కలుపుతూ ఉండే ప్రధాన రహదారి పదేళ్ల నుంచి పూర్తిగా గుంతలతో అధ్వానంగా ఉందని, ఈ రహదారిపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెల్లలో ఉండటంతో గర్భిణులతో సహా ఆసుపత్రికి వచ్చే రోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ వృత్తిదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళుతున్నారని వాపోయారు. ప్రస్తుతానికి రోడ్డు వేయకపోయినా కనీసం గుంతలైనా పూడ్చాలని మంత్రిని బహిరంగ లేఖ ద్వారా కోరారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

కాజులూరు: మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కాజులూరు శ్రీకోటి స్కూల్ కరస్పాండెంట్ కాదా కోటేశ్వరరావు, కార్యదర్శిగా గొల్లపాలెం సెయింట్ జేవియర్స్ కరస్పాండెంట్ స్టీఫెన్ బాబు, ట్రెజరర్‌గా కోలంక వింగ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ దేగల రాంబాబు ఎన్నిక కాగా తిరగాటి కిశోర్, దేవు వీరవెంకటసత్యనారాయణమూర్తి, పోటారులంక చంద్రకుమార్, టి.రాజేష్ కుమార్, ఎండీ హిదాయతుల్లా, సీహెచ్ రాంబాబు, సీహెచ్ పద్మ, కొల్లు బయ్యేశ్వరరావు, ఆనందరాయుడు, నందికోళ్ళ సూరిబాబులు తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆదివారం కాజులూరు శ్రీకోటిస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డేవిడ్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

రేపు కౌన్సిల్ సాధారణ, రిక్విజిషన్ సమావేశం

మండపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, రిక్విజిషన్ సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అవుతుందని కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా హాజరు కానున్నట్టు పేర్కొన్నారు.

వసతులు మెరుగుపరచాలి

కాజులూరు: మండలంలోని ఆర్యావటం శివారు ముత్తావారిగరువులో వసతులు మెరుగుపరచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం గ్రామాల్లో స్థానికులు వీరవల్లి గణపతి, దుర్గాసునీల్, అనిల్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో కాలనీ ఏర్పడి సుమారు 30 ఏళ్లు కావస్తున్నా కనీస వసతులు కరువయ్యాయన్నారు. డ్రైనేజీల ఏర్పాటు, మంచినీటి సరఫరా, రహదారుల సదుపాయం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షం వస్తే వీధులన్నీ జలమయం అవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి ఈ శివారు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం



ద్రాక్షారామ సత్యసాయి మందిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో సత్యసాయి మందిరంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆసియన్ వాస్కులర్ హాస్పిటల్ నేతృత్వంలో ద్రాక్షారామ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత రక్త నాళాల వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ విస్సాప్రగడ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వైద్యులు డాక్టర్ సోమాచారి, డాక్టర్ స్వాతిలు ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, స్పైడర్ నరాలు, పాదాల వేళ్లల్లో గాంగ్రిన్, పాదం, కాళ్లల్లో పుండ్లు, నలుపు రావడం, ఉబ్బిన నరాలు, వెరికోస్ వెయిన్స్ తదితర వ్యాధులకు సంబంధించి 130 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొండబాబు, పి.వర్ధన్, డాక్టర్ ప్రభాకరరావు, రావిపాటి నారాయణరావు, నున్న నర్సింహమూర్తి, కేఎస్ పాపాజీ పాల్గొన్నారు.

లొల్లలో..

రాయవరం: గీతా జయంతి సందర్భంగా మండలంలోని లొల్ల గ్రామంలో గర్భిణులకు ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాం నిర్వహించారు. స్థానిక మానవత ఆశ్రమంలో విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శారీరక బలంతో పాటుగా, మానసిక స్థైర్యాన్ని, ఆధ్యాత్మిక శక్తిని పెంచుకోవడానికి యోగా ఉపకరిస్తుందని శ్రీనివాస చౌదరి తెలిపారు. విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. అల్లూరి వరలక్ష్మి 8వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో లొల్ల, తదితర గ్రామాలకు చెందిన గర్భిణులు పాల్గొన్నారు.



మండపేటలో భోగ ముద్రలో..



కపిలేశ్వరపురంలో పద్మాసన ముద్రలో..



మాచరలో జ్వాలాముద్రలో..



కోరుమిల్లి సాధక ముద్రలో..



కోటిపల్లిలో సిద్ధముద్రలో..

జయ జనార్దన.. కృష్ణా రాధికాపతే..



ధవళేశ్వరంలో కొలువుదీరిన జనార్దన స్వామివారు



మడికిలో సుదర్శన ముద్రలో..

- నేటి నుంచి మొదలుకానున్న ధనుర్మాసం
- నవ జనార్దన ఆలయాల్లో పూజలకు ఏర్పాట్లు
- పల్లెలను తాకనున్న సంక్రాంతి శోభ

రామచంద్రపురం: శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైనది ధనుర్మాసం. గోదాదేవి సాక్షాత్తూ శ్రీరంగనాయకుని పరిణయమాడిన పుణ్యమాసం. పల్లెలకు సంక్రాంతి శోభను తెచ్చేది ధనుర్మాసమే. అదివారం సాయంత్రం సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి తీరం వెంబడి కొలువుదీరిన నవజనార్దనస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు మొదలుకానున్నాయి. సోమకాశురుడనే రాక్షసుడు చతుర్వేదాలను నాశనం చేసే ప్రయత్నం చేయడంతో వాటిని కాపాడేందుకు బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువును వేడుకుంటాడు. క్షీరసాగరం నుంచి శ్రీమహావిష్ణువు భూమిపైకి వచ్చి రాక్షసుణ్ణి సంహరించి వేదాలను రక్షిస్తాడు. అదే సమయంలో భూమిపై తపస్సు చేసుకునేందుకు వచ్చిన నారద మహాముని నవగ్రహాల ప్రభావంతో జనులు కష్టాలను పడుతున్నారని శ్రీమహావిష్ణువుకు వివరించి వారిని విముక్తులను చేయాలని కోరతాడు. గోదావరి తీరం వెంబడి తొమ్మిది ప్రదేశాల్లో శ్రీమహావిష్ణువు స్వయంభువునిగా వెలియగా, నారదమహాముని ఆలయాలను నిర్మించాడని పురాణ ప్రతీతి. ధనుర్మాసంలో నవ జనార్దనాలయాలను సందర్శించి పూజలు చేస్తే నవగ్రహ దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి తీర వెంబడి మండపేట, ఆలమూరు మండలం మడికి, జొన్నాడ, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి, మాచర, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలం కోటిపల్లి, రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలలో నవజనార్దన స్వామి ఆలయాలు ఉన్నాయి. ధవళేశ్వరంలో మొదటి జనార్దనాలయం ఉంది. ఇక్కడ స్వామి వారు యోగముద్రలో ఉంటారు. ఆలమూరు మండలం మడికిలో స్వామివారు సుదర్శన ముద్రలో ఉంటారు. జొన్నాడలో అభయముద్ర, ఆలమూరులో ఉగ్రముద్ర, అభయ ముద్రలోను, మండపేటలో భోగముద్రలోను, కపిలేశ్వరపురంలో పద్మాసన ముద్రలో, మాచరలో జ్వాలాముద్రలో, కోరుమిల్లిలో సాధక ముద్రలో, కోటిపల్లిలో సిద్ధముద్రలోను స్వామివారు కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు నవజనార్దనస్వామి వారి ఆలయాలను దర్శించుకుని పూజలు చేస్తుంటారు. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు మొదలుకానున్నాయి.



జొన్నాడలో అభయముద్రలో..



ఆలమూరులో ఉగ్ర, అభయముద్రలో..

మోగిన నెలగంట



సంప్రదాయ వేషధారణలో భోగిమంట చుట్టూ యువతుల నృత్యం (ఫైల్)

రామచంద్రపురం: నెల గంట మోగింది. తెలుగిళ్లకు సంక్రాంతి సంబరాలను మోసుకొస్తోంది. పెద్ద పండగ కోసం పల్లెలను ముస్తాబు చేయనుంది. తెలతెలవారుతూనే హరినామ సంకీర్తనలు, ఇళ్ల ముంగిట ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, ఒప్పుల కొప్పులు, వయ్యారి భామలు, కొమ్మదాసుల కోలాహలం, పిడకల వేటలో పిల్లలు, పందాల జోరులో పెద్దలు ఇక పల్లెల్లో సందడి చేయనున్నారు. పాశ్చాత్య వేగాన్ని తట్టుకుని తెలుగునాట సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను శోభాయమానంగా చూపించే సంక్రాంతి సంబరాలకు పల్లెలు ముస్తాబు కానున్నాయి. ధనుర్మాసం ప్రారంభాన్ని నెలపట్టుట అని పల్లెవాసుల నానుడి. సూర్యుడు ధనుస్సురాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమవుతుంది. దీనినే ధనస్సు సంక్రమణమని, నెలపట్టుట అంటారు. మకర సంక్రమణం వరకు ఈ ధనుర్మాసం కొనసాగుతుంది. ధనుర్మాసం విష్ణువుకి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా ప్రతీతి. భక్తితో దైవాన్నే పతిగా పొందిన గోదాదేవి తన కోరిక నెరవేర్చుకున్న పుణ్యమాసాన్ని ధనుర్మాసమంటారు. సంక్రాంతి శోభను స్వాగతిస్తూ అదివారం రాత్రి సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమైంది. హరినామ సంకీర్తనలతో వేకువజామునే హరిదాసుల మేలుకొలుపు, ఇంటి ముంగిళ్లను రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దే ఆడపడుచుల హడావుడితో వాడవాడలా పండగ వాతావరణం సందడి చేయనుంది. పాతకు స్వస్తిపలికి కొత్తదనానికి నాంది పలికే భోగి పండుగ కోసం ఎప్పుడెప్పుడు పండగ.. ఏడాది పండగ అంటూ పిడకలు, కలప వేటలో పిల్లలు ఇంటింటికీ వెళ్లి చేసే హడావుడి ఇక కనువిందు చేయనుంది. ఏడాదికోమారంటూ కొమ్మదాసులు, కోయదాసులు, గంగిరెడ్లువారు తదితర సంప్రదాయ కళాకారులు గ్రామాల్లో సందడి చేయనున్నారు. సంక్రాంతి ముగ్గుల పోటీలు, ఆటల పోటీలతో ఊరువాడ కళకళలాడనున్నాయి. కొత్త అల్లుళ్లు, ఇంటికి వచ్చే బంధువుల కోసం సిద్ధం చేసే సంప్రదాయ పిండివంటలు, సున్నుండల తయారీతో ప్రతి ఇల్లు పాకశాలలు కానున్నాయి. పోలీసుల కన్నుగప్పి దిబ్బలపై కోడి పందేలు వేసేందుకు కోడి పుంజులను చంకన పెట్టుకుని పొలం గట్ల వెంబడి పందెంరాయుళ్లు పరుగులు తీసే దృశ్యాలు కనిపించనున్నాయి. ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచి విష్ణాలయాలు, జనార్దన స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి.



గొబ్బిళ్ల వద్ద పాటలు పాడుతున్న అమ్మాయిలు (ఫైల్)



గంగిరెద్దుల వారు (ఫైల్)



కోడి పందేలు (ఫైల్)

ఘనంగా గణిత పురస్కార మహోత్సవం

రామచంద్రపురం: గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ 35వ వార్షికోత్సవ సభ ఆదివారం వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. గణిత పురస్కార మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తి, చంద్రశేఖర్ శాస్త్రి తదితరులు తొలుత రామానుజన్, సంజీవరాయ శర్మ, కృష్ణమూర్తి చిత్రపటాలకు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గత 35 ఏళ్ల కృషిని వివరించారు. ముఖ్యఅతిథి రామానుజన్ గణిత అవార్డు గ్రహీత ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ సంఖ్యలు, వాటి వివరాలను, అవి వినియోగపడుతున్న తీరును వివరించారు. సంజీవరాయ శర్మ అవార్డు గ్రహీత చంద్రశేఖర్ శాస్త్రి మాట్లాడుతూ గణిత విన్యాసాలను విద్యార్థులతో చేయించారు. కృష్ణమూర్తి అవార్డు గ్రహీత వై.పద్మజ మాట్లాడుతూ గణిత శాస్త్ర స్వరూప స్వభావాలను వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల విచ్చేసిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. జాతీయ, రాష్ట్రస్థాయి, స్థానిక విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీవీఎస్ సూర్యనారాయణమూర్తి, తోటకూర సాయి రామకృష్ణ, ఎం.నాగార్జున, కె.శ్రీకృష్ణ సాయి, వసంతకుమార్, పీవై వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



రామానుజన్ గణిత పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తి

ఘనంగా దత్తాత్రేయుని జయంతి

మండపేట: దత్తాత్రేయుని జయంతిని ఆదివారం మండలంలోని ఏడిద, పాలతోడు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయినాథుని ఆలయాల్లో కొలువైన దత్తాత్రేయుని మందిరాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని తర్వాణీపేటలోని షిర్డీ సాయి ఆలయంలో ప్రధానార్చకుడు ఆనంద్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు కాసా నాగేశ్వరరావు దంపతుల నేతృత్వంలో పూజలు నిర్వహించారు. సమస్త దేవతలకు ఆది గురువులుగా పేర్కొనే సప్తర్షులలో ఒకరైన ఆది మహర్షి ,అనసూయల కుమారుడు దత్తాత్రేయుడు త్రిమూర్తి స్వరూపుడని, దేవతలకు జ్ఞాన బోధనలు చేసినట్టు పురాణాలు చెబుతున్నాయని అర్చకుడు ఆనంద్ భక్తులకు వివరించారు. దత్తాత్రేయుడు సృష్టి లయకారుకులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరుల ప్రతిరూపంగా పేర్కొన్నారు. చుట్టుపక్కల వీధుల్లోంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజల్లో కమిటీ సభ్యులు గుండు తాతరాజు, కోన సత్యనారాయణ, ప్రసాద్, గుర్రాల సత్తిబాబు, రాజు, మహిళలు పాల్గొన్నారు.



తర్వాణీపేట ఆలయంలో దత్తాత్రేయుని పూజలు చేస్తున్న మహిళలు

మహాగర్జనకు తరలివెళ్లిన మాలలు



మాలల సింహగర్జనకు కె.గంగవరం నుంచి తరలివెళ్తున్న దళిత నాయకులు



గుంటూరుకు తరలి వెళ్లిన కపిలేశ్వరపురం మండల నాయకులు

కపిలేశ్వరపురం: గుంటూరులో ఆదివారం నిర్వహించిన మాలల మహా గర్జన సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి మాల సామాజిక వర్గీయులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అంగర, కపిలేశ్వరపురం, పడమర ఖండ్రిక, మాచర, లంక గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. మండలంలోని 19 గ్రామాల ఆ సామాజికవర్గ పెద్దలు, యువజన సంఘం ఆధ్వర్యంలో గుంటూరుకు వెళ్లారు. కార్యక్రమంలో పాలింగి కృష్ణకిశోర్, నేల సూర్యకుమార్, పాలింగి శ్రీనివాస్, కొత్తపల్లి వినోద్, సాకా శ్రీను, కనికెళ్ళ శ్రీను, కోనాల సురేష్, సాదే శ్రీను, వి.సుబ్బారావు, మద్దా రమేష్, మొసలి నాగభూషణం, మోర్త శ్రీను, కర్రి బాబులు, పోలిమాటి రమేష్ , గోడి సూర్యారావు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: గుంటూరులో జరుగుతున్న మాలల సింహ గర్జన మహాసభకు మండలం నుంచి దళిత నేతలు భారీగా తరలివెళ్లారు. ఆదివారం ఉదయం కె.గంగవరం ఎస్సీ కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవ్వా భూషణం, దళిత నాయకులు బత్తుల అప్పారావు తదితరులు జెండా ఊపి బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం అమలులో ఉన్నా దళితులకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ సభకు వేలాదిగా మాలలు తరలివస్తున్నారని సభ విజయవంతంగా జరుగుతుందని వారు పేర్కొన్నారు. తామరపల్లి సర్పంచ్ తోకల శ్రీను, తరపట్ల ఆనందరావు, కోటి వెంకట్రావు, నాగన్న, యంటపల్లి నాని, దంగేరు ఉప సర్పంచ్ దార్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా 'నరాల'



నరాల కృష్ణకుమార్

రామచంద్రపురం రూరల్: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రపురం పట్టణానికి చెందిన నరాల కృష్ణకుమార్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు విలేకరులకు తెలిపారు. మామిడికుదురు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన పీఆర్టీయూ జిల్లా కౌన్సిల్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నూతన జిల్లా కౌన్సిల్ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఆయనను ఎంపిక చేశారు. కృష్ణకుమార్ ప్రస్తుతం కె.గంగవరం మండలం బాలాంత్రం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉంది. కోనసీమ జిల్లాలో పీఆర్టీయూ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కృష్ణకుమార్‌ని పలువురు అభినందించారు.

కేశవరంలో రంగా విగ్రహావిష్కరణ



కేశవరంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామ ప్రముఖులు

మండపేట: నిరుపేదల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం సాగించి, చివరికి తన ప్రాణాలను సైతం త్యజించిన మహోన్నతుడు వంగవీటి మోహన రంగా అని కేశవరం గ్రామ ప్రముఖులు పేర్కొన్నారు. రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో కేశవరం గ్రామంలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రంగా విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీలకు కతీతంగా గ్రామంలోని అందరు నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, స్థానికులు, రంగా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శుక్రవారం పేటలో వేంచేసిన కోదండ రామాలయం ఆవరణలో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఆళ్ల తాతారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భారీగా అన్న సమారాధన చేశారు.

నిరుపేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ



ద్రాక్షారామలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

రామచంద్రపురం రూరల్: సత్యసాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ స్వచ్ఛంద సేవా సంస్థ 15 వ వార్షికోత్సవం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ అతిథి గృహం వద్ద ఆదివారం సుమారు రూ.3 లక్షల విలువైన చీరలు, దుప్పట్లు సుమారు 700 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నిరుపేద మహిళలకు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు శివకోటి మధుసూదనరావు మాట్లాడుతూ తమ సంస్థ విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆసుపత్రి వద్ద ప్రతి రోజూ 500 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా 50 మందితో కూడిన తమ బృందం ఏటా ద్రాక్షారామ వచ్చి పలు వర్గాల వారికి నూతన వస్త్రాలు అందించడంతో పాటు వారికి భోజనం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాట్ల చినఅప్పారావు, మాజీ ఎంపీటీసీ యాట్ల రోజారాణి, సంఘ సభ్యులు దాడి భాస్కర్, పి.శ్రీనివాస్, జె.చంద్రశేఖర్, ఐ.రవికిరణ్, బి.శ్రీకాంత్, యాట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు

మండపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరువలేమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఎమ్మెల్యే వేగుళ్ల ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాశ్, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు వుంగరాల రాంబాబు, కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్యభవాని, చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్ళకూరి గొల్లబాబు, ఆర్యవైశ్య నాయకులు సంకా రంగా, కాళ్లకూరి శ్రీనివాస్, వాకచర్ల గుప్తా, కేశవరపు శ్రీనివాస్, గ్రంధి సత్తిరాజు, పట్నాల బాబి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అంగరలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాజిక కార్యకర్తలు నివాళి అర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగనిరతి నేటి యువతరానికి ఆదర్శమన్నారు. తెలుగు రాష్ట్రం ఏర్పాటు కోసం ఆయన చూపిన తెగువ మానవజాతి ఔన్నత్యాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో అంగర సాగు నీటి సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి సూరిబాబు, నాయకులు పిల్లా బసవరాజు, శిల్ప కళాకారుల సంఘం నాయకులు తోరాటి శ్రీను, చీకట్ల గంగరాజు, నాయకులు సుంకర బుజ్జి, కాయల వీర్రాజు, కొంపెల్ల రాంబాబు, సంకాబత్తుల సుభాష్, మేడిద రాంబాబు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి సుభాష్ తదితరుల నివాళి



మండపేటలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

అమరజీవి పొట్టి శ్రీరాములు

రామచంద్రపురం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి, తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అమరుడై మహాపురుషుడిగా చరిత్రలో నిలిచి పోయారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణం లోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం మంత్రి సుభాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన శ్రీరాములు గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం కృషిచేసిన మహనీయుడన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలకారకుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఆ మహనీయుని పోరాటపటిమ, ఆదర్శ భావాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న అంగర, పడమర ఖండ్రిక నాయకులు